క్లుప్తంగా

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీవో వీరబ్రహ్మయ్య

రామగిరి: మండలంలో చేపట్టిన ఓటర్ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానాన్ని వందశాతం పూర్తి చేయాలని ఆర్డీవో వీరబ్రహ్మయ్య అన్నారు. సెంటనరీకాలనీలోని సింగరేణి అతిథి గృహంలో శనివారం బూత్ లెవల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. బీఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరు ఓటర్ కార్డుదారుడి ఆధార్ కార్డుతో అనుసంధానం చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రాంమోహన్, బీఎల్వోలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

మంథని: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జక్కుల సదయ్య పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ముత్తయ్య, చంద్రమౌళి,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి


ఆలయంలో భక్తులకు అన్నదానం

పాలకుర్తి: మండలంలోని వేంనూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. రథసప్తమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం గోదావరిఖనికి చెందిన నేరెళ్ల భీమయ్య- సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి శనివారం ఆలయంలో అన్నదానం చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు గోపు రామయ్య తెలిపారు.

'సంక్షేమ పథకాల్లో ప్రభుత్వం విఫలం'


మాట్లాడుతున్న నాయకులు

మంథని: సంక్షేమ పథకాల్లో ప్రభుత్వం విఫలమైందని అఖిలపక్ష నాయకులు అన్నారు. శనివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. మంథనిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో 80 శాతం అనర్హులున్నారని ఆరోపించారు. దళితులైన మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు ఎంపీ బోర్లకుంట వేంకటేశ్‌నేత డబుల్ బెడ్ రూం ప్రారంభించే ముందు కనీసం ఒక్క దళితుడు అయినా ఉన్నాడా అని ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. 8 ఏళ్లుగా టీఆర్ఎస్ పాలనలో ఎస్సీఎస్టీ బీసీలకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా అర్హులను గుర్తించి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక


నియామక పత్రం అందిస్తున్న శివప్రసాద్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యకర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎలక్షన్ ఆఫీసర్ శివప్రసాద్ తెలిపారు. అధ్యక్షుడిగా ఐలవేణి వీరస్వామి, ఉపాధ్యక్షుడిగా నరేందర్, కార్యదర్శిగా మొగిళి, డైరెక్టర్లుగా నాగుల కుమారస్వామి, మొండయ్య, కనుకయ్య, ఐలవేణి కుమారస్వామి, శ్రీనివాస్, రాజమల్లును ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని వీరస్వామి తెలిపారు.

వామ్మో గుంతలు..!

- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం
- నిత్యం ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న అధికారులు , ప్రజాప్రతినిధులు


గుంతలు పడిన ప్రధాన రహదారి

రామగిరి: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది మంథని – పెద్దపల్లి ప్రధాన రహదారి. రామగిరి మండలం కల్వచర్ల పంచాయతీ పరిధి గోకుల్‌నగర్ నుంచి సెంటినరీకాలనీ ఎస్సీ క్వార్టర్ల వరకు, రత్నాపూర్ పంచాయతీ పరిధి పెద్ద బ్రిడ్జి సమీపం నుంచి ఆదివారంపేట బస్టాప్ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవు మంథని– పెద్దపల్లి ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా మోకాలు లోతు ఏర్పడిన గుంతలతో వాహనాలు చెడిపోతున్నాయని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి నుంచి మంథని వరకు రోడ్డు నిర్మించిన అధికారులు కేవలం నాలుగు కిలోమీటర్ల దూరం ఎందుకు నిర్మించలేదో, కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడం వెనక మతలబు ఎంటో తెలియడం లేదని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ముత్తారం మండల సరిహద్దులోని మానేరులో నూతనంగా నాలుగు ఇసుక క్వారీలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో నిత్యం వేలాది లారీలు అధిక లోడు ఇసుకతో రాకపోకలు సాగించడం వల్ల రోడ్డు ఆనవాళ్లు లేకుండా పోయింది. జిల్లాలోనే అంత్యత ప్రాముఖ్యత కలిగిన మంథని(మంత్రపురి), జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్‌కు నిత్యం వందలాది వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. గుంతలమయంగా మారిన ప్రధాన రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వామ్మో గుంతలు అంటూ జనం జంకుతున్నారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



సెంటినరీకాలనీలోని మంథని, పెద్దపల్లి ప్రధాన రహదారిపై వెళ్లాలంటే భయమేస్తోంది, మోకాలు లోతు ఏర్పడిన గుంతల్లో పడి వాహనాలు కరాబ్ అవుతున్నాయి. కొన్నిసార్లు వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంతగా రోడ్డు చెడిపోయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

– అబ్రహర్, వాహన చోదకుడు, నాగేపల్లి

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



పెద్దపల్లి నుంచి మంథని వరకు రోడ్డు నిర్మించిన అధికారులు సెంటినరీకాలనీలో ఎందుకు నిర్మించడం లేదో తెలియడం లేదు. నిత్యం జిల్లా స్థాయి అధికారులు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి దుస్థితి ఇలా ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– కాటం సత్యం, వాహన చోదకుడు,సెంటినరీకాలనీ

శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే మొగిపురుగు నివారణ


మొగిపురుగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: మొగిపురుగు సోకిన పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పెద్దపల్లి మండలం కనగర్తి, కాపులపల్లి గ్రామాల్లో మొగిపురుగు సోకిన పంట పొలాలను కాపాడుకునేలా రైతులకు సలహాలు, సూచనలిచ్చేందుకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులు ఆందోళనపడొద్దని, వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. మొగిపురుగు నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పొలాస, కూనారం పరిశోధనాకేంద్రాల శాస్త్రవేత్తలు వివరించారు. శాస్త్రవేత్తలు రజనీకాంత్, ఓంప్రకాశ్, బలరాం, శ్రీధర్‌సిద్ధి, ఏడీఏ శ్రీనాథ్, ఏవో అలివేణి, సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీరావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తదితరులున్నారు.

పెద్దపల్లి ఏసీపీగా మహేశ్


మహేశ్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఏసీపీగా మహేశ్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సారంగపాణిని బదిలీ చేసిన అధికారులు.. బెల్లంపల్లి ఏసీపీ మహేశ్‌ను ఇక్కడ నియమించారు. ఎడ్ల మహేశ్ గతంలో పెద్దపల్లి సీఐగా కూడా పనిచేశారు.

వరి తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి


పొలం పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: రైతులు వరి సాగులో మెళకువలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. శనివారం మండలంలోని కాచాపూర్, వడ్కాపూర్ గ్రామాల్లో పలువురు రైతుల పొలాలకు వచ్చిన మొగి పురుగు, కాండం తొలుచు పురుగుల తెగుళ్లు సోకిన వాటిని పరిశీలించి నివారణకు తీసుకోవల్సిన సస్యరక్షణ చర్యలను సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెగుళ్ల నివారణలో ముందస్తు చర్యలు తీసుకుంటే వరిలో నష్టాన్ని తగ్గించవచ్చని చెప్పారు. రైతులు తెగుళ్లు వచ్చిన వెంటనే వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని కోరారు. ఆమె వెంట ఏఈవో రాకేశ్ రైతులు ఉన్నారు.

పోస్టాఫీస్‌లో అధిక వడ్డీ రేట్లు

రామగిరి: పోస్టాఫీసులో అందించే చిన్న మొత్తాల పొదుపు వడ్డీ రేట్లు భారీగా పెరిగాయని పెద్దపల్లి సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మోహన్ అన్నారు. శనివారం సెంటనరీకాలనీ పోస్టాఫీసును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసు అకౌంట్ బ్యాంక్ కన్నా ఎక్కువ వడ్డీ రేటు 4 శాతం ఎక్కువగా ఇస్తుందని ఏడాది పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే 6.6 శాతం, రెండేళ్ల పాటు చేస్తే 6.8 శాతం, మూడేళ్ల పాటు చేస్తే 6.9 శాతం, ఐదేళ్లపాటు చేస్తే 7 శాతం. సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ల పై 8 శాతం వడ్డీ చెల్లించడంతో పాటు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట సబ్ పోస్టుమాస్టర్ నరేంద్రచారి, బ్రాంచి పోస్టుమాస్టర్ రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత


స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థినులు

ధర్మారం: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం ఓ కంపెనీ నుంచి స్కాలర్‌షిప్‌లు అందించారు. కళాశాలకు చెందిన 54 మంది బాలికలకు ఒక్కొక్క విద్యార్థికి ఎనిమిది వేల నుంచి పదివేల చొప్పున రూ.4.44లక్షల విలువైన చెక్కులను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనంత రామకృష్ణ, మల్‌బార్ గోల్డు ప్రతినిధులు విక్కీ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'చలో జగిత్యాల' కు మద్దతు

కోల్‌సిటీ: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణికి మద్దతు తెలుపుతున్నట్లు పద్మశాలీ సేవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండేటి రాజేశ్ తెలిపారు. పద్మశాలీ కమ్యూనిటీకి చెందిన శ్రావణికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పద్మశాలీల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడడం తగదన్నారు. శ్రావణికి మద్దతుగా నిలిచేందుకు జగిత్యాలలోని పద్మశాలీ భవన్‌కు ఈనెల 29న పద్మశాలీలు భారీగా తరలిరావాలని కోరారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

రామగుండం: పట్టణంలోని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్–1104 (టీఈఈయూ) కార్యాలయంలో శనివారం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజేందర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధి ఎండీ.సలీం, ఏపీ ఆరుముళ్ల భూమయ్య, సివిల్ ఈఈ సూర్యనారాయణ, ఇస్మాయిల్ పాషా, అఫ్జల్‌పాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగిసిన టాస్క్ శిక్షణ

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటీ డిగ్రీ, పీజీ కాలేజీలో విద్యార్థులకు ఉద్యోగాలు సాధించడంలో అనుసరించాల్సిన పద్ధతులపై టాస్క్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఇచ్చిన శిక్షణ శనివారంతో ముగిసింది. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇంటర్వ్యూలో అనుసరించాల్సిన పద్ధతులపై, లీడర్‌షిప్ క్వాలిటీస్, ఇంట్రపర్సనల్ స్కిల్స్ అండ్ సాఫ్ట్‌స్కిల్స్‌పై టాస్క్ రిసోర్స్ పర్సన్ థామస్ అవగాహన కల్పించారు.

టీ షర్టులు పంపిణీ

ఎలిగేడు: మండలంలోని నర్సాపూర్‌లో శనివారం కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో గౌడ కులస్తులకు టీషర్టులు పంపిణీ చేశారు. సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌ను కోరిన వెంటనే టీషర్టులు ఇచ్చారని ఈసందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కాంతయ్య, నాయకులు సాయినాథ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో నేడు ఉచిత వైద్య శిబిరం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అమర్‌చంద్ కల్యాణమండపంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా డ్రగిస్ట్ కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదూరి వినోద్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని మా రిసెర్చ్ ఫౌండేషన్, మా ఈఎన్‌టీ ఆస్పత్రికి చెందిన వైద్యులు సేవలందిస్తారని పేర్కొన్నారు. సైనస్ ఇన్‌ఫెక్షన్, వినికిడిలోపం, చెవిపోటు, చీముకారడం, తరచూ జలుబు ఇన్‌ఫెక్షన్ రావడం, శ్వాసకోస ఇబ్బందులు, నిద్రలో గురకపెట్టడం, థైరాయిడ్ తదితర సమస్యలపై వైద్యులు సేవలు అందిస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి మొదలయ్యే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంజేరుపల్లి తండాలో వైద్య శిబిరం

ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి తండా బీ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి వివిధ రకాల బీపీ, షుగర్, ఇతర వ్యాధులపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రాజిరెడ్డి, ఏఎన్‌ఎం స్వరూప, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనగర్తి, కొలనూర్, మడక గ్రామాల్లో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

పాఠశాలకు బీరువా వితరణ

ఓదెల: మండలంలోని హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలకు అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల భిక్షపతి శనివారం బీరువా అందించారు. విద్యార్థులకు కావా ల్సిన సౌకర్యాలను మెరుగుపరచనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేందర్‌రెడ్డి, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: కొత్తగూడెంలో నేడు నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌సీసీడబ్ల్యూయూ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ పిలుపునిచ్చారు. శనివారం ఆర్జీ–2 ఏరియాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో కలసి మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మహాసభల్లో సింగరేణిలో పనిచేస్తున్న అన్ని సెక్షన్ల కాంట్రాక్ట్ కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మొగిలి, పద్మ, సమ్మక్క, రాజేశ్వరి, ఎల్లక్క, విజయ, సుగుణ, రాధమ్మ, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గణన కోసం బీఎస్పీ పోరాటం


రిలే దీక్షల్లో సంతకాలు చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీగణన చేయాలని, బీసీల రిజర్వేషన్లను 52 శాతానికి పెంచాలంటూ బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం కోటిసంతకాల సేకరణ చేపట్టారు. విద్యా, ఉద్యోగరంగాలతో పాటు చట్టసభల్లోనూ బీసీలకు జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు లేని కారణంగా తీరని నష్టం కలుగుతోందని జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్, నియోజకవర్గ కార్యదర్శి రియాజ్ అన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచి రిజర్వేషన్లను సాధించేందుకు బీఎస్పీ పోరాడుతోందన్నారు. కాగా.. బీసీగణన రిజర్వేషన్ల కోసం చేపట్టిన రిలేదీక్షలు 3వ రోజుకు చేరాయి. దీక్షల్లో నాయకులు కుమ్మరి సవిత, శేషాద్రి, శారద, రవికుమార్, విద్యాసాగర్, నహీం, అజీం, మానస, అనూష, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని మంత్రికి మేట్‌ల వినతి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న మేట్‌లు

ధర్మారం: రెండేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో పనిచేసిన తమకు నిరంతరం ఉపాధి కల్పించే విధంగా అవకాశం కల్పించాలని కోరుతూ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఉపాధిహామీ మేట్‌లు కోరారు. కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈశ్వర్‌ను ధర్మారం మండలంలోని వివిధ గ్రామాలలో మేట్‌లుగా పనిచేసిన వారు కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఫీల్డు అసిస్టెంట్లను తొలగించి తమకు టార్గెట్‌లు పెట్టి ఉపాధిహామీ పనులు చేయించారని వివరించారు. తిరిగి ఫీల్డు అసిస్టెంట్లను తీసుకున్న తర్వాత తమకు ఉపాధి అవకాశాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి తమకు తిరిగి నిరంతరం అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

శాటిలైట్ తయారీలో విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థులు తయారు చేసిన నమూనాతో ప్రిన్సిపాల్

ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు నమూనా శాటిలైట్‌ని రూపొందించారు. శాటిలైట్‌కి ఐడియా శాటిలైట్‌గా నామకరణం చేశారు. విద్యాలయంలోని సైన్స్ టీచర్ శివకృష్ణ మార్గదర్శకత్వంలో ఐడియా బాక్స్‌ని శాటిలైట్ రూపంలో రూపొందించటంతో పాటు, నమూనా రాకెట్‌ను తయారుచేశారు. వీటిపై తెలంగాణ ఇన్నవేషన్ సెల్, టీ హబ్ ప్రాముఖ్యత తెలియజేసే చిహ్నాలను అమర్చారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు శివకృష్ణ రాకెట్ ఎలా పనిచేస్తుంది, దాని నుంచి శాటిలైట్ ఎలా బయటకు వచ్చి భూమి చుట్టూ తిరుగుతూ మనకు సేవలను అందిస్తుందో వివరించారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రిన్సిపాల్ మన్నె దీనా నమూనా రాకెట్ శాటిలైట్ రూపొందించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనం నిర్మించాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జ్యోతినగర్: అంబేడ్కర్ భవనం నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంపై డీవైఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లో నిలిచిపోయిన అంబేడ్కర్ భవనం వద్ద డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాగర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండేళ్ల క్రితం మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించిన అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ప్రజాధనం పూర్తిగా దొంగల పాలవుతున్న అధికారులు గాని అధికార పార్టీ నాయకులు గాని పట్టించుకోవడంలేదని ఆరోపించారు. భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ఎంతో విలువైన లక్షల రూపాయల ప్రజాధనం పాడైపోతుందని, పర్యవేక్షణ లేక విలువైన భవన నిర్మాణ సామగ్రి దొంగల పాలవుతుందన్నారు. కనీసం సీసీ కెమెరా ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఈస్ట్ ఏరియా కన్వీనర్ కృష్ణ కుమార్, కో–కన్వీనర్ సురేశ్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం


ఆర్థికసాయం అందిస్తున్న ఏపీజే ట్రస్టు ప్రతినిధులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి గ్రామానికి చెందిన రాయిళ్ల మనోజ్ అనే మూడేళ్ల బాబు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. అంతర్గాంకు చెందిన అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అంగోతు రవికుమార్ నాయక్ తన ట్రస్టు సభ్యుల బృందంతో బాలుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం సర్పంచ్ మేరుగు పోశం చేతుల మీదుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేల నగదును బాధిత బాలుడి తండ్రి సంపత్‌కు అందజేశారు. ట్రస్టు ప్రతినిధులు శ్రీకాంత్, సాయి, సురేశ్, రజిత పాల్గొన్నారు.

టీబీ పేషెంట్లకు పౌష్టికాహారం పంపిణీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పీహెచ్‌సీ పరిధిలోని క్షయవ్యాధి గ్రస్తులకు లయన్స్‌క్లబ్ సహకారంతో సమకూర్చిన పౌష్టికాహారం కిట్లను జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ శనివారం పంపిణీ చేశారు. మండలంలోని రాఘవాపూర్ పీహెచ్‌సీ ఆవరణలో 42 మందికి అందజేశారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వ పరంగా మందులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు ఎరబాటి వెంకటేశ్వర్‌రావు, బండ బాబురావు, జయపాల్‌రెడ్డి, పవన్‌కుమార్, కావేటి రాజ్‌గోపాల్, ఇన్‌చార్జి డాక్టర్ లావణ్య, శశాంక, వెంకటేశ్వర్లు, రమేశ్, సత్యనారాయణ తదితరులున్నారు.

రహదారి నిర్వహణేదీ?


ఫోర్ లేన్ రహదారిపై పేరుకుపోయిన మట్టి

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆనుకుని ఫోర్‌లేన్ రహదారిపై మట్టి పేరుకుపోవడంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో బైక్‌లు అదుపుతప్పి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి నిర్వహణ బాధ్యతలు నిర్వహించాల్సిన ఫోర్‌లేన్ కాంట్రాక్ట్ సంస్థ రహదారిపై పేరుకుపోయిన మట్టిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత సంస్థ అధికారులు స్పందించి రహదారిపై మట్టిని తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.